క్లుప్తంగా

సారా విక్రేతల అరెస్ట్

సోమల: సారా విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ దేవరాజులు ఆదివారం తెలిపారు. వివరాలు.. మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లె పంచాయతీ గురుకానివారిపల్లెలో సారా అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు చేశారు. సారా అమ్ముతున్న గురుస్వామి, మల్లికార్జున, రెడ్డెప్ప అనే వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద 240 ప్యాకెట్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం పుంగనూరు కోర్టుకు పంపినట్లు ఆయన తెలిపారు.

మద్యం అక్రమంగా తరలిస్తూ..



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సెబ్ సీఐ, పట్టుబడిన మద్యం, సీజ్ చేసిన బైక్

పలమనేరు: కర్ణాటక నుంచి బైక్‌లో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ యువకున్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 620 టెట్రాప్యాకెట్లు, బైక్‌ను సీజ్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సెబ్ సీఐ ఎల్లయ్య ఆదివారం తెలిపారు. రూట్ వాచ్‌లో భాగంగా సెబ్ అధికారులు క్యాటిల్ ఫామ్ అండర్‌బ్రిడ్జి వద్ద తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో పలమనేరు మండలం గొల్లపల్లికి చెందిన నాగరాజు కుమారుడు చంద్ర(20) కర్ణాటక నుంచి మద్యం తెస్తుండగా పట్టుకున్నట్టు సీఐ తెలిపారు. స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కొత్తపేటలో ఆదివారం తిరుపతికి చెందిన రొటరీక్లబ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో 300 మందికి కంటిపరీక్షలు నిర్వహించి, 50 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. అనంతరం రోటరీక్లబ్ సభ్యులు, ప్రభావతమ్మ మెమోరియల్ ట్రస్టు వారు మహిళలకు రెండు కుట్టు మిషన్లు ఉచితంగా అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు చలపతి, రెడ్డెప్పరెడ్డి, లక్ష్మీపతి, సుధాకర్‌రెడ్డి, డాక్టర్ విజయ పాల్గొన్నారు.

ప్రభుత్వంపై పచ్చ మీడియా కుట్ర



ఈనాడు పత్రిక ప్రతులను తగులబెడుతున్న వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అప్రతిష్టపాలు చేసేందుకు పచ్చ మీడియా కుట్ర చేస్తోందని వైఎస్సార్ విద్యార్థి సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఓబుళరెడ్డి ఆరోపించారు. ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద వైఎస్సార్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఈనాడు పత్రిక ప్రతులను తగులబెట్టి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ, అభిమానాన్ని చూసి ఓర్వలేక చంద్రబాబు డైరెక్షన్‌లో పచ్చమీడియా అసత్య ప్రచారాలకు తెరతీసిందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో మీడియాకు ఇచ్చిన స్వేచ్ఛను ఈనాడు వంటి పత్రికలు కాలరాస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి పత్రికలు ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి సంఘం నాయకులు మణికంఠ, అశోక్ రెడ్డి, వంశీరెడ్డి, సెంథిల్‌కుమార్, బాషా, భార్గవ్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు జడ్జిలు మన్మథరావు, వి.గోపాలకృష్ణ, ఏపీ ఫైనాన్స్ మినిస్టర్ బుగ్గన రాజేంద్రనాథ్, కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, జి.శ్రీనివాస్ నాయుడు, ఎమ్మెల్సీ అరుణ్ కుమార్, తెలంగాణ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, రఘునందనరావు, తెలంగాణ ప్రభుత్వ విప్ ప్రభాకరరావు, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, జబర్దస్త్ టీం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి





మాట్లాడుతున్న జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిక అధికారి రాజ్యలక్ష్మి, హాజరైన పదో తరగతి విద్యార్థులు

- జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిక అధికారి రాజ్యలక్ష్మి

పలమనేరు: వచ్చే పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో హాస్టల్ పిల్లలు మెరుగైన ఫలితాలు సాధించేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిక అధికారి రాజ్యలక్ష్మి సూచించారు. పలమనేరు, పుంగనూరు, కుప్పం ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో ఉంటూ పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది పదోతరగతి పరీక్షల్లో కూడా హాస్టల్ విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారన్నారు. ఈ దఫా సైతం కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలోనూ ఉత్తీర్ణత మెరుగ్గా ఉండేలా నిరూపించాలన్నారు. ముఖ్యంగా హాస్టళ్లలో చదువుకుంటున్న పిల్లలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని, మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ప్రేరణకర్త మంజులారెడ్డి పరీక్షలకు తర్ఫీదుకు సంబంధించిన విషయాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఓలు, బీసీ డబ్ల్యూఓలు షకీలా, నరసింహులు, మీనాక్షి, జగ్గయ్య, హాస్టల్ వార్డెన్లు, విద్యానిపుణులు సుబ్రమణ్యం, బాలాజీ, రమణ, జైకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, హాస్టళ్లలోని టెన్త్ విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోత్స్న

మెరుగైన ఫలితాలను సాధించాలి

పులిచెర్ల(కల్లూరు): ప్రతి విద్యార్థి చదువుకునే సమయంలో తనకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదవాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసరు జ్యోత్స్న తెలిపారు. కల్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం మండలాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో పదో తరగతి చదువుతున్న బీసీ హాస్టళ్ల విద్యార్థులకు పరీక్షల గురించి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 76 మంది బాలబాలికలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంగ్లం, హిందీ, గణితం, సైన్స్ విషయాలపై పునశ్చరణ తరగతులు, పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడం, వెనకబడిన విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే విద్యార్థులు కూడా పరీక్ష సమయంలో ఎలాంటి భయాందోళనకు గురి కావొద్దన్నారు. కార్యక్రమంలో వెంకటసిద్దులు, మోహనకృష్ణయ్య, హాస్టల్ వార్డెన్లు నవీన్‌కుమార్, నరేష్ కుమార్‌రెడ్డి, మహేశ్వరి పాల్గొన్నారు.

చదువుతో పాటు సంస్కారం ముఖ్యం

- తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు పెట్టుకోండి
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని పిల్లలు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. పలమనేరు పట్టణంలోని శ్రీవాణి, మధు విద్యాసంస్థల వార్షికోత్సవ ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నేటి తరం పిల్లలకు చదువుతో పాటు సంస్కారం చాలా ముఖ్యమన్నారు. పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. నేటి యువకులే దేశానికి వెన్నెముక అని, ఆరోగ్యకరమైన సమాజం కోసం కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణను కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. విద్యార్థినులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ కృష్ణమూర్తి రెడ్డి, శ్రీవాణి, వైస్ ప్రిన్సిపల్స్ ఆనంద్‌రెడ్డి, గోపీనాథ్, దినేష్, కళాశాలల కరస్పాండెంట్ చినపాల బాలసుందరం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

ఎంహెచ్‌పీఎస్ ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ ఖయ్యూం



రామకుప్పం: ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామకుప్పంకు చెందిన అబ్దుల్ ఖయ్యూంను నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అబ్దుల్ ఖయ్యూం పోరాట ప్రతిమను గుర్తించి అతనికి పదవిని ఇచ్చినట్లు అందులో పేర్కొన్నారు. ఖయ్యూం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆలమూరు రఫీకి కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

కుప్పంరూరల్: పుస్తక పఠనంతోనే విజ్ఞానం వస్తుందని ప్రబోధానంద సేవాసమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం కుప్పం పట్టణంలోని ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్‌లో ప్రబోధానందస్వామి రచించిన పుస్తకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచి పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని సూచించారు. ఇప్పటి పిల్లలు చిన్నప్పటి నుంచే ఫోన్లకు అలవాటు పడి భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటున్నారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు చిన్నతనం నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకాశ్, శరవణ, కృష్ణ, వెంకటలక్ష్మి, వాణి తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రబోధానంద సేవా సమితి సభ్యులు

కనకదుర్గ అలంకరణలో బాటగంగమ్మ



బైరెడ్డిపల్లె: స్థానిక బాటగంగమ్మ ఆలయ మండపం పూజల్లో భాగంగా ఆదివారం అమ్మవారు కనకదుర్గమ్మ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

వి.కోట: 2022–23 సంవత్సరానికి అర్హులైన విద్యార్థులు ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోతరగతి పాసైన విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం లేదా రెండో సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులు ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులన్నారు. ఈ నెల 27వ తేదీన పదో తరగతి పాస్ సర్టిఫికెట్, ఆధార్ కాపీ, రెండు ఫొటోలు తీసుకుని కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని కోరారు.

చౌడేపల్లిలో..

చౌడేపల్లె: స్థానిక జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్‌లో చేరడానికి అవకాశం కల్పించారని ప్రిన్సిపల్ సాయిశంకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మధ్యలో చదువు ఆపేసిన వారు, ఒకేషనల్ గ్రూపులో చదవుతూ మధ్యలో ఆపేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 27న చివరి గడువుగా ప్రకటించారని విద్యార్థులు గుర్తించాలన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు టీటీడీ అధికారులు, వేద పండితులు బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ముమ్మరంగా చేపట్టారు. 11 రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు మార్చి 9వ తేదీతో పూర్తి అవుతాయి. మార్చి 6న శ్రీవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, పట్టణంలో ఊరేగించనున్నారు.

ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ

గంగవరం: మండలంలోని కల్లుపల్లి గ్రామంలో నూతన తాగునీటి ట్యాంకు నిర్మాణానికి ఆదివారం నాయకులు, పంచాయతీ అధికారులతో కలిసి భూమిపూజ చేశారు. గ్రామానికి రూ.17 లక్షలు జేజేఎం నిధులతో గ్రామంలో తాగునీటి ట్యాంకు మంజూరైంది. ట్యాంకు నిర్మాణ పనులను మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతిచంద్రప్ప భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉమాదేవి, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, బాలకృష్ణ, గోపీకృష్ణ, వెంకటరమణ, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న నాయకులు

సైనిక్ స్కూల్‌కు విద్యార్థిని ఎంపిక



సాయిధరణి

పుంగనూరు: మండలంలోని ఏటవాకిలి ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న టి.సాయిధరణి సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు స్కూల్ ఉపాధ్యాయుడు కిషోర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రవేశ పరీక్షలో విద్యార్థినికి 171 మార్కులు రావడంతో సైనిక్ స్కూల్‌కు అర్హత సాధించినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు పార్వతమ్మ, దీపా, వినాయక్, తనుజ విద్యార్థినిని అభినందించారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత



కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి

పుంగనూరు: పట్టణంలో ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, వేసవి ప్రారంభం కావడంతో ప్రజలంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి కోరారు. ఆదివారం ఉదయం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని 31 వార్డుల్లో కూడా పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పండ్లు, మాంసం దుకాణాలు, హోటళ్లలో నిల్వ చేసిన వస్తువులను తినరాదని సూచించారు. చెడిపోయిన పండ్లతో పానీయాలు చేసి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వ్యాపారులు పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరాదని సూచించారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న గ్రామస్తులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది

చౌడేపల్లె: మండలంలోని ఆమినిగుంట పంచాయతీ బూరగపల్లెలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో గడ్డివామి దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆర్.చిన్నరెడ్డెప్పరెడ్డికి చెందిన వరిగడ్డి వాముకు నిప్పంటించారు. మంటలను గుర్తించి స్థానికులు అదుపు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. పుంగనూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. గడ్డివాము కాలిపోవడంతో రూ.30 వేలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

వేడుకగా సరస్వతీ యాగం

తిరుపతి కల్చరల్: విద్యార్థుల విద్యాభివృద్ధిని కాంక్షిస్తూ తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఇస్కాన్ సమీపంలోని కంచి మఠంలో సరస్వతీ యాగం వేడుకగా నిర్వహించారు. ప్రముఖ వేద ఘనాపాటి చంద్రమౌళీశ్వర పర్యవేక్షణలో చేపట్టిన యాగంలో వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారికి కంకణాలు, అక్షింతలు అందజేసి ప్రసాదాలు వితరణ చేశారు. బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు భీమాస్ బాలాజీ మాట్లాడుతూ విద్య వినయాన్ని ఇస్తుందని, వినయం మంచి ప్రవర్తనను కలుజేస్తుందని, మంచి నడవడికతో ధనాన్ని సంపాదించవచ్చని తెలిపారు. ఆ ధనంతో అందరూ సుఖంగా ఉండగలరన్నారు. సరస్వతీ అమ్మవారి అనుగ్రహంతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆచార్య చక్రవర్తి రాఘవన్, తిరుపతి బ్రాహ్మణ సమాజం కోశాధికారి ప్రభాకర్, సహాయ కార్యదర్శి ఓవి.రామశర్మ, కొత్తపల్లి విజయ్‌కుమార్, వేదం హరిప్రసాద్, గంగాధర్, పి.పట్టాభిరామరావు, ప్రసాద్, క్రెడిట్ సొసైటీ క్యాషియర్ కుమార్, మహిళా విభాగం సభ్యులు సంధ్యారాణి, జీఆర్.పుష్పలత పాల్గొన్నారు.



సరస్వతీ యాగం నిర్వహిస్తున్న వేద పండితులు, హాజరైన బ్రాహ్మణ సమాజ సభ్యులు

గెలుపే లక్ష్యంగా పని చేయండి



మంత్రి పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి



సదుం: మంత్రి పెద్దిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న వెంకటస్వామి

సోమల: వచ్చే 2024 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన హేమంత్‌రెడ్డి తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి స్వగృహంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు జిల్లాస్థాయి పదవి ఇచ్చినందుకు హేమంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి మళ్లీ ముఖ్యమంత్రి గా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని చేసుకోవడానికి కష్టపడి పని చేయాలని తెలిపారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని మంత్రి ఆర్కేరోజా, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేజే భరత్, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్పను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని, గెలుపే లక్ష్యంగా కష్టపడి పనిచేస్తానని హేమంత్ తెలిపారు.

మంత్రితో ఎస్సీ సెల్ అధ్యక్షుడి భేటీ..

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలో వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగం ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవలే నియమితులైన వెంకటస్వామి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రి ఆయనను శాలువతో సన్మానించారు. అలాగే జెడ్పీచైర్మన్ శ్రీనివాసులును కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన, మంత్రి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌ను కలిసిన హేమంత్ రెడ్డి

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు లయన్స్ క్లబ్, లియో క్లబ్ సేవలు అభినందనీయమని జిల్లా గవర్నర్ లయన్ వినూతాప్రకాష్ తెలిపారు. ఆమె ఆదివారం కల్లూరు క్లబ్‌ను సందర్శించి క్రీడాభివృద్ధికి యువత, విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడానికి అందిస్తున్న ప్రోత్సాహం, చేపట్టిన వివిధ సామాజిక కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. ఇప్పటికే చేసిన పలు సేవా కార్యక్రమాలను సీడీ రూపంలో పంపితే క్లబ్ అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. జిల్లా క్రీడావిభాగం అధ్యక్షుడు లయన్ మహమ్మద్ అలీ, లియోక్లబ్ అధ్యక్షుడు హేమంత్ కుమార్, కార్యదర్శి మహేశ్వరరెడ్డి, ఉపగవర్నర్ లయన్ రామరాజ, లయన్ గౌతంరెడ్డి, లయన్ జ్యోతి పాల్గొన్నారు.



కల్లూరు లయన్స్ క్లబ్‌ను సందర్శిస్తున్న జిల్లా గవర్నర్ లయన్ వినూతప్రకాష్

ఉచిత క్యాన్సర్ హెల్త్ క్యాంపునకు స్పందన

వి.కోట: పట్టణంలోని లయన్స్‌క్లబ్ కార్యాలయంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ క్యాంపునకు విశేష స్పందన లభించినట్లు లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు సురేంద్రగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన అపోలో ఆస్పత్రి వైద్యులు 20 మంది శిబిరంలో పాల్గొని మొత్తం 160 మందికి క్యాన్సర్, కార్డియాలజీ, బీపీ, షుగర్, ఇతర వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. అందులో 22 మందిని క్యాన్సర్, కార్డియాలజీకి సంబంధించి శస్త్రచికిత్సకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో నాగభూషణం, ట్రస్ట్ చైర్మన్ నాగరాజేంద్ర, కార్యదర్శి తుకారాం, కోశాధికారి శ్రీనివాసులు, సభ్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

పేర్నాటిని గెలిపించుకుందాం

రామకుప్పం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం పట్టభద్రుల అభ్యర్థి శ్యాంప్రసాద్ రెడ్డి విజయానికి పట్టభద్రులు సహకరించాలని ఆ పార్టీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం కోరారు. వారు మాట్లాడుతూ మండలంలోని పట్టభద్రులంతా కూడా ప్రజాసంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని అభ్యర్థించారు. సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రరాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల భర్తీకి పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం పట్టభద్రులు సహకరించాలని కోరారు.

నేడు వాహనాల వేలం

పలమనేరు: వివిధకేసుల్లో పట్టుబడిన ఓ కారు, మూడు బైక్‌లను గంగవరం పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ప్రవేశ రుసుం చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

సదుంలో..

సదుం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు వాహనాలను సోమవారం వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ మారుతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక ఆటో, ద్విచక్ర వాహనానికి ఉదయం బహిరంగ వేలం నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని సూచించారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: సారా తరలిస్తూ పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని ఎస్‌ఐ కోరారు.

ఆదర్శవంతంగా లయన్స్‌క్లబ్ సేవలు

పుంగనూరు: అన్నిరకాల వారికి సేవలు అందిస్తూ లయన్స్‌క్లబ్ ఆదర్శంగా నిలుస్తోందని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ వినూతప్రకాష్ తెలిపారు. ఆదివారం రాత్రి లయన్స్‌క్లబ్ సమావేశాన్ని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శివ ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, ఈశ్వరమ్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మొదటి గవర్నర్ డాక్టర్ రామరాజఅర్స్, రెండో గవర్నర్ చంద్ర రెడ్డి, కేబినెట్ సెక్రటరీ జ్యోతిరామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ద్వారా నిర్మించిన డయాలసిస్ సెంటర్‌లో రోగులకు అందిస్తున్న సేవలను వివరించారు. అలాగే ఉచిత కంటి వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలు గురించి వివరించారు. అనంతరం వినూతప్రకాష్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ పుంగనూరు వారు ఆదర్శంగా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమాలను ఇలాగే మరింతగా విస్తృత పరచాలని ఆకాంక్షించారు. క్లబ్‌లో సేవలు అందించిన వారికి మెమెంటోలు అందజేసి సన్మానం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గోపాలకృష్ణ, పీఎల్ శ్రీధర్, ముత్యాలు, అమరావతి సురేష్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినూతప్రకాష్

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఈనాడు

కుప్పంరూరల్: ఈనాడు దినపత్రిక ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేస్తోందని చిత్తూరు జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చీలేపల్లి రవి ధ్వజమెత్తారు. ఆదివారం కుప్పం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యార్థులతో కలిసి ఈనాడు దినపత్రికకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీరావుకు తనకు నచ్చని ప్రభుత్వం ఉంటే లేనిపోని అబాండాలు వేయడం అలవాటన్నారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కుట్రలు పన్ని అబద్ధపు కథనాలు ప్రచురిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ దాము, గణపతి, విద్యార్థులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి విభాగం ప్రతినిధులు